ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 21.4

3
కామారెడ్డి
జిల్లా వార్తలు
సోమవారం 11 మార్చి 2024

బస్వాపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భిక్కనూరు, మార్చి 10:మండలంలోని బస్వాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-2001 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటు పూర్వ విద్యార్థులు సంతోషంగా గడిపారు. అనంతరం పాఠశాలలో వారికి బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.



అడుగంటుతున్న ఆశలు!

- యాసంగి గట్టెక్కేనా?
- జిల్లాలో ఎండుతున్న పంటలు
- ప్రాజెక్టులో తగ్గిన సాగు నీరు.. ఎండిన చెరువులు
- వట్టిపోతున్న బోరు బావులు.. ఎండుతున్న వరి పంటలు
- పంటలు ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన

దోమకొండలో బీటలు వారిన వరి పొలం

కామారెడ్డి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఎన్నో ఆశలతో యాసంగి పంటలను సాగు చేస్తున్న రైతులకు సకాలంలో సాగు నీరందక పంటలు ఎండిపోతుండడంతో రైతుల ఆశలు అడుగంటుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో సుమారు 3.20లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 1.85లక్షల ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. నెలరోజుల కిందటే పూర్తిస్థాయిలో వరినాట్లు పడగా తాగునీరు అందకపోవడంతో నాట్లదశలోనే పంటలు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఎండలు రోజురోజుకూ ముదురుతుండడం ప్రధాన ప్రాజెక్టులలో సాగునీరు తగ్గుముఖం పట్టింది.

ప్రాజెక్టులు, చెరువుల్లో తగ్గుతున్న నీటి మట్టం

జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్ట్‌లలో నీరు చాలా మట్టుకు తగ్గాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.527 టీఎంసీల నీరు నిల్వఉంది. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు 2005 క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1.820ల టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.806 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల కొనసాగుతోంది. కౌలాస్ ప్రాజెక్టుల నుంచి పంటలకు ఒకసారి మాత్రమే సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వాగులు, చెరువులు సైతం ఎండిపోయాయి. దీంతో భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో భూగర్భజలాలు సైతం అమాంతంగా పడిపోతున్నాయి. నెల వ్యవధిలోనే 1.97 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయి. ప్రస్తుతం సరాసరి భూగర్భ జలాల నీటిమట్టం 12.92 మీటర్ల లోతులో నీరు నిల్వ ఉంది. భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డిలో అత్యధికంగా 24.06 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయి. భూగర్భజలాలు పడిపోవడంతో పంట పొలాల్లోని మోటార్ బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో జిల్లాలోని భిక్కనూర్, దోమకొండ, కామారెడ్డి, మాచారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, పిట్లం తదితర మండలాల పరిధిలో పంట పొలాలకు సాగు నీరు అందక వరి పంట ఎండిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలకు సాగునీరు అందక భూమి బీటలు వారుతుంది. నాగిరెడ్డిపేట మండలంలో వివిధ గ్రామాల్లో బోరుబావుల్లో నీరు తగ్గిపోయి ఎత్తిపోతున్నాయి.

బోర్లు ఎత్తిపోయి వరి పంట ఎండిపోతుంది

● కొర్ర దుప్యా, రైతు, మెల్లకుంట

బోరుబావుల సహాయంతో ఐదున్నర ఎకరాలలో వరి పంటను సాగు చేశాను. పొలాల్లో ఉన్న నాలుగు బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయి బోర్లు ఎత్తిపోవడంతో వరి పంట ఎండిపోతోంది. మూడు ఎకరాల సొంత భూమితో పాటు, రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని ప్రస్తుత యాసంగిలో వరి పంటను సాగు చేశాను. బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయి పంట ఎండిపోతుంది. రెండెకరాల వరకు పంట పూర్తిగా ఎండిపోయింది. మిగితా పొలం ఎండిపోతుంది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలి.

జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు రైతులు సుమారు 3.45లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు 4.21 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు సుమారు 90 శాతం మేర పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు, పప్పు దినుసు పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 2.65 లక్షల ఎకరాలలో వరి సాగవు తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 2.05లక్షల ఎకరాలలో వరినాట్లు పడ్డాయి. ఈ నెల చివరికల్లా మరిన్ని వరినాట్లు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న 34,515 ఎకరాలలో సాగయింది. శనగ 65,197 ఎకరాలలో, జొన్న 31878 ఎకరాలలో, గోధుమ 1054 ఎకరాలలో, పొద్దుతిరుగుడు 5202 ఎకరాలలో, కందులు 1785 ఎకరాలలో, చెరుకు 1015 ఎకరాలలో, సోయాబిన్ 546 ఎకరాలలో పంటలు సాగయ్యాయి.

ఎత్తిపోతున్న బోర్లు.. ఎండిపోతున్న నీటి బావులు, చెరువులు

జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగాయి. గత వారం రోజుల నుంచి జిల్లాలో 35 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు సైతం అమాంతంగా పడిపోతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, ఎల్లా రెడ్డి డివిజన్లలో భూగర్భ జలాలు తీవ్ర స్థాయిలో అడుగంటు తున్నాయి. కామారెడ్డి మండలంతో పాటు గాంధారి, దోమ

నాగిరెడ్డిపేటలో సన్నగా పోస్తున్న బోరు

కొండ, భిక్కనూర్, తాడ్వాయి, లింగంపేట్ మండలాల్లో భూగర్భ జలాలు 17 మీటర్లలోతులోకి పడిపోయాయి. ఎల్లారెడ్డి డివిజన్‌లో ఇదే పరిస్థితి నెలకొంటుంది. భూగర్భ జలాలు పడిపోతుండడంతో మోటారు బోర్లు ఎత్తిపోతున్నాయి. రెండు ఇంచులు పోసే మోటారు బోరు ప్రస్తుతం ఆఫ్ ఇంచ్‌లో పోస్తున్నాయి. మరికొన్ని చోట్ల నీటి బావులు, చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. పంట పొలాల్లో మోటారు బోర్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలోని బోరు బావుల కింద వేసిన పంటల్లో నీరు లేక బీటలు వారుతు ఎండిపోతున్నాయి.

బోరుబావుల్లో నీరు బాగా తగ్గిపోయింది

● బల్‌రాంరెడ్డి, రైతు, రాఘవపల్లి

బోరుబావులో నీరు చాలా వరకు తగ్గిపోయింది. బోర్ల సహాయంతో ప్రస్తుత యాసంగిలో 8 ఎకరాలలో వరి పంట వేశాను. 5 బోర్లు ఉండగా వాటిలో ఒక బోరులో మొత్తం నీరు ఇంకిపోయి బోరు ఎత్తిపోయింది. మిగతా నాలుగు బోర్లలో నీరు సగానికి తగ్గిపోయింది. ఇంకా పంటచేతికి రావడానికి సుమారు నెలరోజులకు పైగా ఉన్నందున బోరుబావుల్లో నీరు తగ్గినందున పంటచేతికి వస్తుందోలేదోనని భయంగా ఉంది.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నిజాయితీ మోసగాడు రేవంత్‌రెడ్డి

- మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- సీఎం స్థాయిలో ఉండే వ్యక్తి మాట్లాడే మాటలు రేవంత్‌రెడ్డి మాట్లాడడం లేదు
- తాను అయ్యపేరు చెప్పుకుని వచ్చానని అంటున్నారు
- నేను ఉద్యమ నాయకుడు కేసీఆర్ పేరు చెప్పుకొనే రాజకీయాల్లోకి వచ్చా..
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్లా ఎమ్మెల్యే కేటీఆర్
- కేటీఆర్ సమక్షంలోనే భగ్గుమన్న విభేదాలు

కామారెడ్డి టౌన్, మార్చి 10: మోసగాళ్లలో నిజాయితీ గల మోసగాడు రేవంత్‌రెడ్డి అని, గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి చెప్పిన మోసపూరితమైన మాటలు విని ప్రజలు కాంగ్రెస్‌నే గెలిపించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్లా ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్యగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కామారెడ్డి నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడిందని ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ భరతంపడతామన్నారు. మార్చి 17 వరకు ఓపికగా ఉంటామని అప్పటికీ కాంగ్రెస్ వంద రోజుల పాలన పూర్తవుతుందని హామీలు నెరవేర్చకుంటే కాంగ్రెస్ పార్టీకి బొందతీసుడేనని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి నీవు నిజమైన మొగాడివైతే ఆడబిడ్డలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2500ల పింఛన్, వృద్ధులకు 4000ల చొప్పున పింఛన్ ఇవ్వమని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డికి రైతులపై నిజమైన ప్రేమ ఉంటే ఎన్నికల కోడ్ రాకముందే ఈ యాసంగి సీజన్ నుంచే రైతులకు రూ.500ల బోనస్ ప్రకటించాలన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అయ్యపేరు చెప్పి కుర్చీలో కూర్చున్నాడంటూ సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే తనపై విమర్శలు చేయడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రేవంత్‌రెడ్డి నీలాగా ఆంధ్రోళ్ల బూట్లునాకి, సంచులు మోసి, పార్టీలు మారి తాను రాజకీయాల్లోకి రాలేదని ఉద్యమ నాయకుడు.. నా అయ్య కేసీఆర్ కొడుకుగా వచ్చానని సిరిసిల్లా నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడకుండా కేసీఆర్ పట్ల దిగజారుడు మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కేసీఆర్ ఏమి చేయలేదని ఆయన కట్టించిన సచివాలయంలోని ఉండి మాట్లాడుతున్నాడని లంకె బిందెలు ఉన్నాయని వస్తే ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నాడని, పేగులు మెడలో వేసుకుంటానంటూ మాట్లాడుతున్నాడని.. ఆయ నేమైన బోటి కొట్టేవాడా.. జేబులో కత్తెర పెట్టుకున్నానంటూ, లాగుల్లో తొండలు ఇడిస్తానంటూ మాట్లాడుతున్నాడని సీఎం స్థాయిలో ఉండే వ్యక్తి మాట్లాడే మాటలు రేవంత్‌రెడ్డి మాట్లాడడం లేదని అన్నారు. ఎన్నికల్లో గెలిచేవాడే మొగోడా అని? ఓడిన వాడు మొగోడు కాదా అని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. అయితే రాహుల్‌గాంధీ, కామారెడ్డిలో ఓడిన రేవంత్‌రెడ్డి ఎవరని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రోత మాటలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు.

రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇస్తుందా?

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం చివరి వరకు రైతులందరికీ రైతుబంధు ఇస్తుందా అనేది అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌కు సవాల్ విసరడం కాదని సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ముఖ్యమంత్రికి రాజీనామా చేసి మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి కేటీఆర్‌తో పోటీకి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో అనేక మాయమాటలు చెప్పి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు వాగ్దానాలలో ఉచిత బస్సు హామీ ఒక్కటే నెరవేరిందని ఆ పథకంలో బస్సు ఎక్కిన మహిళ అందరు కాంగ్రెస్‌ను తిట్టుకుంటున్నారని అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది

● గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కామారెడ్డిలో పోటీ చేయాలని తానే కోరానని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారాలు, మాయమాటలతో ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్, కామారెడ్డిలో బీజేపీ గెలిచిందన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ ఓటమికి నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, నా తరపున కేసీఆర్‌కు, కేటీఆర్‌కు క్షమాపణలు కోరుతున్నామన్నారు. ఇక్కడ గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి భూములు గుంజుకుంటారని, రేవంత్‌రెడ్డి, కేసీఆర్ నాన్‌లోకల్ అని చెప్పి, గుళ్ల గోపురాలకు, కుల సంఘాలకు డబ్బులు ఇచ్చి మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నాడని అన్నారు. ఒక్క రూపాయి లేకుండా గెలిచానని అంటున్నాడని ఆయన పెట్టిన కోట్ల రూపాయలు ప్రజలను మభ్యపెట్టడానికి కాదా అనేది గుండెమీద చేయి వేసుకుని చెప్పాలన్నారు. అదేవిధంగా ఇక్కడ ఉన్న ఓ వ్యక్తి ప్రభుత్వ సలహాదారునిగా నియమాక అయ్యాడని కామారెడ్డిలో పలుమార్లు ఓడి, నిజామాబాద్‌లోనూ పోటీచేసి ఓడిపోయి రేవంత్‌రెడ్డి కాలు మొక్కి సలహాదారుని పోస్టు తెచ్చుకుని బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నాడని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, సురేందర్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, మున్సిపల్ చైర్మన్ నిట్టు జాహ్నవి, జడ్పీవైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, సీనియర్ నాయకులు తిర్మల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సుమిత్రానంద్, యువజన విభాగం నాయకులు గంప శశాంక్, భానుప్రసాద్, లక్ష్మీనారాయణ ఆయా మండలాల నాయకులు, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో మరోసారి బయటపడ్డ బీఆర్‌ఎస్ విభేదాలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీచేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. అయితే కేసీఆర్ ఓటమికి ప్రధాన కారణం కామారెడ్డి బీఆర్‌ఎస్‌లోని ముఖ్యనేతల మధ్య సమన్వయ లోపం విభేదాలేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోసారి కామారెడ్డి బీఆర్‌ఎస్ నాయకుల మధ్యవిభేదాలు బయటపడ్డాయి. ఆదివారం కామారెడ్డి కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ మంత్రి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. కేటీఆర్ సమక్షంలోనే బీఆర్‌ఎస్ పలువురు ముఖ్యనేతలు వాగ్వాదానికి దిగారు. బీఆర్‌ఎస్ ముఖ్యనేత తిర్మల్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేరు ప్రస్తవించకపోవడంతో గంప గోవర్ధన్ అనుచరులు ఆందోళనకు దిగారు. పలువురు నేతలు స్టేజీ వద్దకు దూసుకువచ్చి తిర్మల్‌రెడ్డిని నిలదీశారు. కేటీఆర్ నాయకులు, కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేసిన ఆందోళనకారులు వినిపించుకోలేదు. తిర్మల్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు గంప గోవర్ధన్ కలుగజేసుకుని తమ అనుచరులను సముదాయించారు.



వాగ్వాదానికి దిగిన వారిని వారిస్తున్న కేటీఆర్

జహీరాబాద్ ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా

గాలి అనిల్ కుమార్?

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కోసం ముగ్గురు పోటీ
- వీరిలో గాలి అనిల్ కుమార్ అభ్యర్థిత్వం ఖరారైనట్లు సమాచారం
- పార్లమెంట్ ముఖ్యనేతలతో సమావేశమైన మాజీ సీఎం కేసీఆర్
- అభ్యర్థి ఎవరనే దానిపై ముఖ్యనేతల అభిప్రాయ స్వీకరణ
- రెండు మూడు రోజుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని ప్రకటించే అవకాశం

కామారెడ్డి/ఎల్లారెడ్డి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎవరనే దానిపై రెండు మూడు రోజుల్లో కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన గాలి అనిల్ కుమార్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా దాదాపు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్ నివాసంలో జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ముఖ్య నేతల సమావేశం మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఎవరైనే దానిపై కేసీఆర్ బీఆర్‌ఎస్ నేతలతో సమీక్షించారు. జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఇటీవల బీజేపీలో చేరడం ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిని సైతం బీబీ పాటిలనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ తరపున ఎంపీ అభ్యర్థి ఎవరు ఉంటారనే దానిపై సర్వత్రా కొనసాగుతూనే వస్తోంది. మరోవైపు ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో పార్టీ కేడర్‌లోనూ అయోమయం నెలకొంటూ వస్తోంది. ఈ సందర్భంగా కెడర్‌లో భరోసా నింపేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం కామారెడ్డిలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశం అయిన తర్వాత కేటీఆర్‌తో పాటు కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని బీఆర్‌ఎస్ ముఖ్యనేతలైన మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాఫేదార్ శోభ, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, సురేందర్, హన్మత్‌షిండే, జిల్లా అధ్యక్షుడు ముజిబుద్ధీన్, డీసీసీబీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తిర్మల్‌రెడ్డిలతో పాటు ముఖ్యనేతలతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు సమావేశమై ఎంపీ అభ్యర్థి ఎవరనే దానిపై అభిప్రాయాలు స్వీకరించారు. జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ టికెట్ కోసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, టికెట్ ఆశించారు. అయితే భాస్కర్‌రెడ్డికి టికెట్ ఇస్తే తాము పని చేయలేమని కొందరు బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు అధిష్ఠానానికి తేల్చి చెప్పినట్లు తెలిసింది, అయితే సుభాష్‌రెడ్డి, గాలి అనిల్ కుమార్ పేర్లు తెరమీదకి వచ్చాయి. ఆదివారం కేసీఆర్ సమక్షంలో జరిగిన సమావేశంలో గాలి అనిల్ కుమార్ అభ్యర్థిత్వాన్ని పార్టీ ముఖ్య నేతలంతా సుముఖత తెలిపినట్లు తెలిసింది. అయితే బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్ పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఇక ఆ పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించవలసి ఉంది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ జహీరాబాద్ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ బరిలో ఉండనున్నారు. వీరికి పోటీగా బీఆర్‌ఎస్ నుంచి ఎవరు ఉంటారనేది. ఈ రెండు రోజుల్లో స్పష్టత రానుంది.



హైదరాబాద్‌లో జహీరాబాద్ ముఖ్య నేతలతో సమావేశమైన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు



గాలి అనిల్ కుమార్

బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తా..

- చైర్‌పర్సన్‌తో పాటు ఆరుగురు కౌన్సిలర్లు రాజీనామాకు సిద్ధం
- గంప గోవర్ధన్ సారథ్యంలో పని చేయలేం
- కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోకుండా గంప గోవర్ధన్‌కు కేటీఆర్ బాధ్యతలు ఎలా అప్పగిస్తారు?
- బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు

కామారెడ్డి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు అప్పగిస్తే బీఆర్‌ఎస్ పార్టీకి తాను రాజీనామా చేస్తానని పార్టీ సీనియర్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, మరో ఆరుగురు కౌన్సిలర్‌లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గానికి పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలను గంప గోవర్ధన్‌కు అప్పగిస్తే ఎన్నికలకు ఆయన సారథ్యంలో తాము పని చేసేందుకు సిద్ధంగా లేమన్నారు. ఆదివారం కామారెడ్డిలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామారెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకోకుండా పార్లమెంట్ ఎన్నికలకు కామారెడ్డి బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవడం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో గంప గోవర్ధన్ పూర్తిగా విఫలమయ్యారని పలువురు సీనియర్ నాయకులను ఆయన పట్టించుకోకపోవడంతో కామారెడ్డి పార్టీ శ్రేణుల్లోనూ ఆయనపై తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. అలాంటి నేతకు మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోసారి బాధ్యతలు అప్పగించడం సరైందికాదన్నారు. గంప గోవర్ధన్ సారథ్యంలో పని చేసేందుకు నియోజకవర్గంలోని చాలా మంది బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా లేరన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఆయనకే బాధ్యతలు అప్పగిస్తే తామంతా రాజీనామా చేస్తామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ అధిష్ఠానం మరోసారి ఆలోచించి కామారెడ్డి నియోజకవర్గం ఎన్నికల బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు కాకుండా వేరే ఎవరికి ఇచ్చినా తామంతా పని చేస్తామని నిట్టు వేణుగోపాల్‌రావు తెలిపారు.

పురాతన కట్టడాలను భావి తరాలకు అందించాలి

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్

రాజంపేట, మార్చి 10: రాజంపేట మండల కేంద్రంలోని పురాతన గడీల బావిలో ఆదివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చెత్తమట్టిని తొలగిస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టారు. పురాతన కట్టడాలు అంతరించిపోకుండా రాబోయే కాలానికి మార్గదర్శకాలుగా తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు యువత ముందుకు వచ్చి సహకరించాలని అన్నారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన గడీల బావిని ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి పునరుద్ధరించాలన్నారు. తమ వంతుగా అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న రాజంపేట మండలం అభివృద్ధిలో ముందు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో రాజేశం, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాహెర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వర్ని, మార్చి 10: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్‌ను ఆదివారం వర్నిమండల కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాహెర్ బిన్ హందాన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తాహెర్‌బిన్‌హందాన్ అందించిన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం గౌరవ పదవిని అప్పజెప్పిందని పీసీసీ డెలిగేట్ డాక్టర్ రాజిరెడ్డి పేర్కొన్నారు.

'పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


జల్లాపల్లిలో మురికి కాలువను శుభ్రం చేయిస్తున్న డీఎల్‌పీవో

కోటగిరి, మార్చి 10: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన 'గ్రామాల్లో పాలన అస్తవ్యస్తం' అనే కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. డంపింగ్ యార్డు, మురికి కాలువలు, రక్షిత మంచినీటి పథకంలో పేరుకుపోయిన నాచును తొలగించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టారు. బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా జల్లాపల్లి గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. సాగునీటి కాలువ పక్కన మురికి నీరు నిలిచిన ప్రాంతాన్ని మొరంతో చదును చేయించారు. కొడిచర్ల గ్రామంలో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. కారేగాం మంచినీటి పథకంలో పేరుకుపోయిన నాచును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో సాయిబాబా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై కార్యదర్శులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాలలో కార్యదర్శులు నిత్యం పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. విధి నిర్వహణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తప్పవని డీఎల్‌పీవో హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో మారుతీ, పంచాయతీ కార్యదర్శులు అనిత, దీపిక పాల్గొన్నారు.

ధ్వంసమైన వర్సిటీల పునర్నిర్మాణం చేపట్టాలి

- వైస్ చాన్స్‌లర్‌లను తక్షణమే నియమించాలి : ప్రొ.పున్నయ్య



సదస్సులో మాట్లాడుతున్న ప్రొ.పున్నయ్య

డిచ్‌పల్లి, మార్చి10: రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, వర్సిటీల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలని, ధ్వంసమైన వర్సిటీల పునర్నిర్మాణం చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ పున్నయ్య అన్నారు. ఆదివారం తెలంగాణ వర్సిటీలో ఉన్నత విద్యారంగంలో సవాళ్లు, వర్తమాన రాజకీయాలు అనే అంశంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కన్వెన్షన్ రెండోరోజు ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధికి రూ.5వేల కోట్ల నిధులను కేటాయించాలని, ప్రతీ పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్ అందించాలని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ వర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేశారు. లీకన్వెన్షన్‌లో 26మందితో కమిటీని ఎన్నుకున్నారు. యూనివర్సిటీల కన్వీనర్‌గా మమత (ఓయూ) ఎన్నిక కాగా, కోకన్వీనర్‌గా ప్రసాద్, ఆంజనేయులు, పవిత్ర ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.సూరి ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి రమేశ్‌బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, జిల్లా కార్యదర్శి అనిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్, రవి, సంధ్య, ప్రసాద్, దీపిక, మహేశ్, నాగరాజు, సాయికుమార్, దినేశ్, చిత్రు, పవన్ పాల్గొన్నారు.
















మహనీయుల జయంతి ఉత్సవాల ఎన్నికైన కమిటీ సభ్యులు

మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఎన్నిక

బాన్సువాడ టౌన్, మార్చి 10: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉత్సవ కమిటీ ఇన్‌చార్జి సంతోష్ తెలిపారు. అధ్యక్షుడిగా పోశీరాం, గౌరవ అధ్యక్షుడిగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా పాండురంగం, కోశాధికారిగా హన్మాండ్లు, ఉపాధ్యక్షులుగా వినోద్, సాయన్న, మోహన్, సతీష్, రాములు తదితరులను సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులాలకు అతీతంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొని మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



బీర్కూర్‌లో మాట్లాడుతున్న స్వామీజీలు

నేడు మహా పాదయాత్ర ప్రారంభం

బీర్కూర్, మార్చి 10 : లోక కల్యాణం కోసం సద్గురు మహదేవ స్వామి, నాగభూషణం స్వామిల ఆధ్వర్యంలో సోమవారం మహాపుణ్య క్షేత్రమైన కొలనుపాక వరకు మహాపాదయాత్ర చేపడుతున్నారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ ప్రపంచంలో, దేశంలో శాంతి నెలకొనాలని కోరుతూ ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. ఈ యాత్ర పొతంగల్ నుంచి ప్రారంభమవుతుందని, యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక పుణ్యక్షేత్రానికి చేరుతుందన్నారు. ఈ పాదయాత్రలో పాల్గొనే భక్తులకు అల్పాహారం, భోజన, బస వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని చెప్పారు. భక్తులందరూ పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.



ప్రైజ్ అందుకుంటున్న విద్యార్థినులు

సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

బీర్కూర్, మార్చి 10: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం నేను సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ టెస్టులో బీర్కూర్ సన్‌రైజ్ పాఠశాలకు చెందిన 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని సాయి ప్రతీక్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా విద్యార్థిని నాల్గవ ర్యాంకు సాధించారు. ఈ మేరకు విద్యార్థినికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లెల రాజశేఖర్, ఉపాధ్యాయులు రజితలు విద్యార్థిని అభినందించారు.

పరమేశ్వర ఆలయ నిర్మాణానికి ఎంపీ విరాళం

బీర్కూర్, మార్చి 10: మండలంలోని బరంగేడ్గి గ్రామంలో పరమేశ్వర ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన భక్తులు ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని ఎంపీ బీబీ పాటిల్‌ను కోరారు. ఈ మేరకు ఎంపీ ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం గ్రామస్థులు హైదరాబాద్‌లోని ఎంపీ నివాసానికి వెళ్లారు. విరాళం అందజేసినందుకు గాను ఎంపీని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

గిర్ని తండాలో సీసీ రోడ్డు పనులు

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మార్చి 10: మహ్మద్‌నగర్ మండలంలోని గిర్ని తండాలో కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ జయ ప్రదీప్, రవీందర్ రెడ్డిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు గ్రామాల అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామ గ్రామానా సీసీ రోడ్లతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు పాటు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సవాయి సింగ్, నాగభూషణం, మోయిన్, అజయ్, బలరాం, బాబు, సంతోష్‌రాథోడ్ తదితరులున్నారు.

జిల్లాలో రసవత్తరంగా కుస్తీ పోటీలు

బిచ్కుంద, మార్చి 10: మండలంలో మహా శివరాత్రి పురస్కరించుకుని కుస్తీ పోటీలు నిర్వహించారు. ప్రతీ ఏటా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో చివరిరోజు కుస్తీ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. కుస్తీపోటీల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి మల్లయోధులు పోటీ పడ్డారని తెలిపారు. గెలుపొందిన వారికి మఠాధిపతులు నగదు అందజేశారని తెలిపారు. ఈ ఉత్సవాలలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని కొర్పోల్‌లో ఆదివారం రసవత్తరంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని హరిహర దేవాలయం వద్ద గత మూడు రోజులుగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కుస్తీ పోటీలలో పాల్గొనేందుకు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. చివరి కుస్తీలో వర్ని మండలం సిద్దాపూర్‌తండాకు చెందిన గోపాల్ 4తులాల వెండి కడియంను గెలుచుకుని విజేతగా నిలిచాడు. కుస్తీ పోటీలను చూడడానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నేటితో ఉత్సవాలు ముగిశాయని గ్రామస్తులు తెలిపారు.

ఎల్లారెడ్డి: మండలంలోని అడవి లింగాల గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. మండలాలు జిల్లాకు పక్కన గల మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోటీలు నిర్వహించారు. వంద రూపాయల నుంచి కుస్తీ మొదలుకొని రూ.2వేల వరకు గెలుపొందిన వారికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ప్రతాప్‌రెడ్డి, జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని సంఘం, దుర్కి, మిర్జాపూర్ గ్రామాలలో కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మలయోధులు విచ్చేసి కుస్తీ పోటీల్లో తలబడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



బిచ్కుంద కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్ల యోధులు



లింగంపేటలో విజేతకు వెండి కడియం బహూకరిస్తున్న గ్రామస్థులు

'ఎమ్మెల్యేను అవమానపరిస్తే ప్రజలను అవమానపరిచినట్లే'

దోమకొండ, మార్చి 10: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని అవమానపరిస్తే అయనకు ఓటు వేసి గెలిపించిన ప్రజలను అవమానపరిచినట్లే అని బీజేపీ మండలాధ్యక్షుడు చింతల రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ప్రజలు అక్కరలేదని వదిలి నిజామాబాద్‌కు పారిపోయిన షబ్బీర్‌అలీకి కామారెడ్డిలో ప్రోటోకాల్ అవసరమా అని అన్నారు. రమణారెడ్డి ఇద్దరు ముఖ్యమంత్రుల మీద పోటి చేసి గెలుపొందడం జరిగిందన్నారు. ప్రజలు రమణారెడ్డి ఎమ్మెల్యేగా కావాలని కోరుకుని ప్రజల మదిలో నుంచి వచ్చిన నాయకుడన్నారు. అలాంటి నాయకుడిని ప్రోటోకాల్ విషయంలో అవమానించినట్లు చేస్తే తాము ఊరుకోమని అన్నారు. కలెక్టర్ అయి ఉండి ప్రోటోకాల్ గురించి పట్టించుకోకుండా శిలాఫలకాలు చేయించడం సరికాదన్నారు. అధికారులు, రాజకీయనాయకులు ప్రోటోకాల్ పట్ల సక్రమంగా ఉండాలన్నారు. మళ్లీ ఇలాంటివి పునరావృతమైతే గ్రామ స్థాయి కార్యకర్త నుంచి మొదలుకుని మండల నాయకులందరము జిల్లా కేంద్రంలో మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ నాయకుడు సొంత డబ్బులు రూ. 150 కోట్లతో కామారెడ్డి నియోజకవర్గాని అభివృద్ధి చేస్తారన్నారు. దోమకొండలో ఉన్నటువంటి 30 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా మార్చాడానికి షబ్బీర్‌కు గుర్తుకు రావడం లేదా అన్నారు. అభివృద్ధికి కృషి చేస్తున్న తమ నాయకుడికి అడ్డు పడకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు అనుపాటి నరేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, నారాయణ, ఎస్‌పాల్‌రెడ్డి, రవి, గాజులపల్లి విఠల్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, రవిందర్‌రెడ్డి, వేణు, నర్సింలు, శ్రీనివాస్, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భర్త ఇంటి ముందు భార్య, కుటుంబీకుల ధర్నా



కార్తీక్ ఇంటి ముందు ధర్నా చేస్తున్న శివాని కుటుంబ సభ్యులు

కామారెడ్డి టౌన్, మార్చి 10: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌లో నివాసం ఉండే వడ్ల కార్తిక్ ఇంటి ముందు ఆయన భార్య శివాని, ఆమె కుటుంబీకులు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో సిరిసిల్లా జిల్లా కేంద్రానికి చెందిన శివానిని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌కు చెందిన వడ్ల కార్తిక్‌కు ఇచ్చి వివాహం చేశామని తెలిపారు. వివాహ సమయంలో రూ.5లక్షల నగదు, 15 తులాల బంగారాన్ని అప్పగించామన్నారు. వివాహమైన 3 నెలల తర్వాత గర్భవతి కావడంతో శివానిని తల్లిగారి ఇంటి వద్ద కార్తిక్ వదిలేసి వెళ్లిపోయాడని పాప పుట్టిన తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదిర్చి వారిని హైదరాబాద్‌లో ఉంచారని తెలిపారు. మరో 6 నెలల తర్వాత అదనపు కట్నం తేవాలని శివానిని కార్తిక్ వేధించడంతో పాటు ఆమెను తల్లిగారి ఇంటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడని అప్పటి నుంచి ఆమెను ఇంటికి తీసుకు రాలేదని తమకు న్యాయం చేయాలని ధర్నాకు దిగారు. దీంతో ఇంటి ముందు కూర్చున్న వారితో కార్తిక్ గొడవపడడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువురి కుటుంబ సభ్యులను కామారెడ్డి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

బీజేపీ జిల్లా కమిటీ,మండల అధ్యక్షుల నియామకం

కామారెడ్డిటౌన్,మార్చి 10: బీజేపీ జిల్లా కమిటితో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల మండల అధ్యక్షులను పార్టీ సంస్థగత మార్పులో భాగంగా నూతన నియామకాలు చేపట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా బుస్స సురేష్,పాల్వంచ మండల అధ్యక్షునిగా పోసుఅనిల్, బీబీపేట మండల అధ్యక్షుడిగా బట్టుపల్లి రంజిత్‌గౌడ్, దోమకొండ మండల అధ్యక్షుడిగా మాడురి భూపాల్‌రెడ్డి,భిక్కనూర్ మండల అధ్యక్షుడిగా ఉప్పురిరమేష్, రాజంపేట మండల అధ్యక్షుడిగా పిట్ల శ్రీనివాస్, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా ఆకుల భరత్, రూరల్ అధ్యక్షుడిగా చందన శ్రీధర్, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండల అధ్యక్షుడిగా సంతోష్ రెడ్డి,లింగంపేట అధ్యక్షుడిగా శ్రీనివాస్ మోతె,ఎల్లారెడ్డిరూరల్ అధ్యక్షుడిగా నర్సింలు, నాగిరెడ్డిపేట మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్, గాంధారి మండల అధ్యక్షుడిగా మధుసూదన్ రావు, ఎస్ఎస్‌నగర్ మండల అధ్యక్షుడిగా రాంరెడ్డి,రామారెడ్డిమండల అధ్యక్షుడిగా ఈశ్వర్‌లను నియమించారు.అలాగే జిల్లా కమిటిలో జిల్లా ఉపాధ్యాక్షులుగా సతీష్‌జోషి, లక్ష్మీనారాయణ,ప్రధాన కార్యదర్శులుగా రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి,సెక్రటరీలుగా సరోజ,శంకర్‌గౌడ్, అరుణ్ పటేల్, నర్సింహాచారి,జిల్లా కార్యాలయ సెక్రటరీగా హన్మండ్ల సురేష్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నందివేణు, మహిళ మోర్చాఅధ్యక్షు రాలిగా విశ్వనాధుల అనిత, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి,ఓబీసీ మోర్చా అధ్యక్షుడుబాలరాజు, మైనార్టీమోర్చాఅధ్యక్షుడిగా నేహల్, అధి కార ప్రతినిధులుగా అవధూత నరేందర్,హన్మండ్లతో కూడిన కార్య వర్గాన్ని ఏర్పాటుచేసినట్లు ఆమె తెలిపారు.

'లేబర్ కార్డును రెన్యువల్ చేయించుకోండి'

పెద్ద కొడప్‌గల్, మార్చి 10: మండలంలో గల కార్మిక సోదరులు తమ లేబర్ కార్డును రెన్యువల్ చేయించుకోవాలని మండల కార్మికుల సంఘం అధ్యక్షులు గొర్రె రాములు సూచించారు. పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో తోటి కార్మికులకు సంబందించిన కార్డులను రెన్యువల్ చేయించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతు కార్మికులు లేబర్ కార్డును తీసుకోవడం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయని సూచించారు. ఈకార్డుతో పాటు శ్రమకార్డు తీసుకోవడం వలన కార్మికులకు అనుకోని అవాంతరాలు ఎదురైతే ఫలితం ఉంటోందని తెలిపారు. ప్రతి 5 సంవత్సరాలకు ఒక సారి లేబర్ కార్డును రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.దీంతో పాటుగానే కొత్తగా ఉన్న కార్మికులు కూడ లేబర్ కార్డు పొందవచ్చని సూచించారు. ప్రతి నెల అమావాస్య రోజున సంఘం సమావేశం ఉంటోందని, కార్మికులు తప్పని సరిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు.



కార్మిక సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకుంటున్న కార్మికులు

అర్ధాంతరంగా నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

మద్నూర్, మార్చి 10: గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గ్రామ పంచాయతీలను పెంచడం జరిగింది. గ్రామాల్లో ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల నిర్మాణం పూర్తి కాకపోవడంతో కార్యదర్శి పాఠశాలల ఆవరణలో విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని హసన్ టాక్లీ గ్రామంలో 2023 అక్టోబరులో గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. పనులు ప్రారంభించినప్పటికీ అర్ధాంతరంగానే నిలిచిపోయాయి. దీంతో గ్రామ పంచాయతీ లేక ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వం ప్రారంభించి, అసంపూర్తిగా ఉన్న భవనానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం నిధులు వెచ్చించి భవన నిర్మాణం పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



హసన్ టాక్లీలో పూర్తి కానీ పంచాయతీ భవనం

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లుగారి మహేష్

బీబీపేట, మార్చి 10: బీబీపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లుగారి మహేష్ నియమితులయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా పార్టీలో విధేయుడిగా ఉంటూ పార్టీలో చురుకుగా పని చేయడంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించారని, జిల్లా అధ్యక్షుడు ఇలియాజ్‌కు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

బస్వాపూర్‌లో ఏటీఎం చోరీకి దుండగుల యత్నం



బస్వాపూర్‌లోని ఏటీఎం మిషన్

భిక్కనూరు, మార్చి 10: గుర్తుతెలియని దుండగులు ఏటీఎంలో చోరీకి యత్నించిన సంఘటన భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం బస్వాపూర్ గ్రామం గల ఉన్న కెనరాబ్యాంకు ఏటీఎం మిషన్ శనివారం సాయంత్రం సమయంలో పనిచేయలేదు. దీంతో ఖాతాదారులు కెనరాబ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రి 9గంటల సమయంలో బ్యాంకు మేనేజర్ అభినవ్‌కుమార్ సింగ్ ఏటీఎం వద్దకు చేరుకుని మిషన్‌ను పరిశీలిస్తుండగా ఏటీఎం మిషన్ వెనుకాల భాగం ధ్వంసం చేసి ఉంది. దింతో ఏటీఎం లావాదేవీలను పరిశీలించి డబ్బులు చోరి కాలేదని నిర్ధారించుకుని బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.కాగా సంఘటన స్థలానికి ఎస్సై చేరుకుని సీసీ పుటేజిని పరిశీంచారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

భిక్కనూరు, మార్చి 10: అప్పుచేసి వ్యవసాయ బావి వద్ద బోర్ల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఈర నర్సింలు(43) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోసిస్తున్నాడు. తనకున్న మూడెకరాల వ్యవసాయ బావి వద్ద గత మూడు నెలల క్రితం అప్పుచేసి మూడు బోర్లు వేయగా ఫెయిల్ అయ్యాయి. అప్పటి నుంచి చేసిన అప్పులు ఎలా తీర్చాలో ఏమో అంటు కుటుంబసభ్యుల వద్ద బాధపడేవాడు. చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కేబుల్ వైర్ దొంగలకు దేహశుద్ధి

● పోలీసులకు అప్పగింత

భిక్కనూరు, మార్చి 10: వ్యవసాయబావుల వద్ద కేబుల్‌వైర్లను ఎత్తుకెళ్త రైతులకు నిద్రలేకుండా చేస్తున్న ఇద్దరు దొంగలను రైతులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన భిక్కనూరు మండలకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. భిక్కనూరు పట్టణంతో పాటుగా గుర్జకుంట, ర్యాగట్లపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల్లో గతకొంతకాలంగా వ్యవసాయబావుల వద్ద బోరు మోటారుకు ఉండే కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. దీంతో భిక్కనూరు పట్టణంలో అంతంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉండే వ్యవసాయబావుల రైతులు రెండురోజులుగా కాపలా కాస్తున్నారు. భిక్కనూరు పట్టణానికి చెందిన రాజు, అర్జున్ అంతంపల్లి బ్రిడ్జి వద్ద కేబుల్‌వైర్‌ను కాలుస్తున్నారన్న పక్కా సమాచారంతో రైతులు అక్కడికి చేరుకుని వారిని చుట్టుముట్టి పట్టుకుని దేహశుద్ధి చేశారు. అక్కడినుంచి కుమ్మరిగల్లిలో విద్యుత్ స్థంబానికి వారిని కట్టెసి పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు భిక్కనూరు పోలీసులు అక్కడికి చేరుకుని రాజు,అర్జున్ ఇంట్లో దాచిపెట్టిన మరి కొంత కేబుల్ వైర్లు, కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకుని ఇరువురికి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలి

కామారెడ్డి టౌన్, మార్చి 10: రోజురోజుకూ దేశ వ్యాప్తంగా మహిళలపై, బాలికలపై, శ్రామిక మహిళలపై హింస పెరుగుతున్న నేపథ్యంలో హింసకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమాలు చేయాలని టీపీటీఎఫ్ మహిళ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సంఘటిత శక్తి ద్వారా మాత్రమే మహిళలపై హింసను అరికట్ట గలుగుతామని తెలిపారు. గృహ హింసలకు వ్యతిరేకంగా, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడ మహిళలు ప్రజా సంఘాల ద్వారా, శ్రామిక మహిళా సంఘాల ద్వారా ఉద్యమాలను నిర్మించి, ప్రతిఘటిస్తూ ఎదుర్కోవాలని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు నలినిదేవి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు వెళ్తున్న రామభక్తుడికి సన్మానం

భిక్కనూరు, మార్చి 10: తమిళనాడు నుంచి అయోధ్యకు వెళ్తున్న రామభక్తుడు తమిళనాడుకు చెందిన కర్ణ అనే యువకుడి సైకిల్‌యాత్ర ఆదివారం భిక్కనూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా కర్ణను భిక్కనూరు శ్రీరామదండు ప్రతినిధులు మెడికల్ రమేష్, అనీల్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కర్ణ మాట్లాడుతూ ఈ నెల 2న తమిళనాడులో సైకిల్‌యాత్ర ప్రారంభించడం జరిగిందని 15న అయోధ్యకు చేరుకుని శ్రీరాముడి దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మేరకు కర్ణకు రామదండు ప్రతినిధులు ఓఆర్ఎస్, వాటర్ బాటిళ్లు, శీతపానీయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదండు ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికి గృహజ్యోతి అమలు చేస్తాం

పెద్ద కొడప్‌గల్, మార్చి 10: మండలంలోని కాటేపల్లి గ్రామంలో గల అర్హులందరికి గృహజ్యోతి పథకం కింద జీరో కరెంట్ బిల్లులు అందజేస్తామని కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ తెలిపారు. ఆదివారం విద్యుత్ శాఖ స్పాట్ బిల్లర్ శ్రీకాంత్‌తో కలిసి లబ్దిదారులకు జీరో కరెంట్ బిల్లు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ మాట్లడుతు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

కామారెడ్డిటౌన్,మార్చి 10:కామారెడ్డి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ జహీరాబేగం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఆమెకు మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రవి,తేజాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉర్రూతలూగించిన కొమరక్క



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న కొమ్రక్క

నాగిరెడ్డిపేట, మార్చి 10 : మండలంలోని తాండూర్ త్రిలింగ రామేశ్వరాల యం వద్ద ఆదివారం రాత్రి జరిగిన జబర్దస్త్ ఫేమ్ కొమ్రక్క సాంస్కృతిక కార్యక్రమం భక్తులను, ప్రజలను ఉర్రూత లూగించింది. మహాశివ రాత్రి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు రాత్రి రథోత్సవ కార్య క్రమం ఉన్నందున, ఆలయం వద్ద కొమ్రక్క టీమ్‌తో సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. కొమ్రక్క ప్రత్యేక కార్యక్రమం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. కొమ్రక్క కార్యక్రమాన్ని తిలకించడానికి నాగిరెడ్డిపేట పరిసర మండలాల భక్తులు, ప్రజలు భారీ గా తరలివచ్చారు. ఆలయం వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లను నిర్వహించారు. భక్తులకు అన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు, నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - గామి
ప్రియా 70 - భీమా
ప్రియా 35 - ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి - భీమా
వెంకటేశ్వర - గామి

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

